## క్లుప్తంగా

### పశువులకు టీకాలు



బానకచెర్లలో పశువుకు టీకా వేస్తున్న పశువైద్యాధికారులు

నందికొట్కూరు: పశువుల్లో గొంతువాపు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి భాస్కర్ తెలిపారు. బుధవారం పాములపాడు మండలంలోని బానకచెర్ల గ్రామంలో 250 గేదెలకు, దూడలకు, ఎద్దులకు, ఆవులకు టీకాలు వేశారు. పశువుల యజమానులు గొంతు వాపు వ్యాధి నివారణ కోసం టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యశాల సిబ్బంది ప్రసన్న, గోపాలమిత్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### సింహవాహనంపై శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి



సింహవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బుధవారం ఉదయం ఆలయ పురోహితులు వెంకట్రామయ్య ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి సింహవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అదేవిధంగా రాత్రి 7 గంటలకు భక్త జన సందోహం మధ్య గరుడోత్సవం వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో ఈఓ ఏడీ వెంకటరమణ, ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా ఆలయ భూముల వేలం

నందికొట్కూరు: దేవాలయాల భూముల వేలం పాటలు ప్రశాంతంగా జరిగినట్లు ఈఓ జనార్దన తెలిపారు. బుధవారం పాములపాడు మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో దేవాలయాల భూములకు వేలం పాటలు దేవదాయ శాఖ అధికారులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో వెలసిన ఈశ్వరస్వామి, వీరభద్రస్వామి, కేశవస్వామి, ఆంజనేయస్వామి దేవస్థానాలకు చెందిన 167 ఎకరాలకు వేలం పాటలు నిర్వహించడం జరిగిందన్నారు. మూడేళ్లకు ఒకే సారి వేలం నిర్వహించడంతో వేలంలో రూ. 25 లక్షలు ఆదాయం వచ్చిందని చెప్పారు. ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా ఎస్ఐ అశోక్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవదాయశాఖ పర్యవేక్షణ అధికారి శశి, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

కొత్తపల్లి: మండలంలో ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీఓ జవహర్ బాబు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీ శివరామయ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి పంచాయతీలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాలలో పారిశుద్ధ్య పనులపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మండలానికి పారిశుద్ధ్య నిర్వహణకు ఒక ట్రాక్టర్ మంజూరు అయ్యిందని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు చిన్నస్వామి, అనుషా, చాందిని, ప్రసాద్, నాగరాజు, క్రాంతి కుమార్ తదితరులు హాజరయ్యారు.

### విత్తన దుకాణాల తనిఖీ



దుకాణంలో విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఏడీఏ బి.ఆంజనేయ

ఆత్మకూరు: పట్టణంలోని పలు విత్తన, ఫర్టిలైజర్ దుకాణాలను బుధవారం ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బి.ఆంజనేయ, మండల వ్యవసాయాధికారి డి.విష్ణువర్ధన్‌రెడ్డి తనిఖీ చేశారు. విత్తనాలు అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే రైతులు విత్తనాలు కొన్నప్పుడు తప్పనిసరిగా రశీదును పొందాలన్నారు. విత్తనాల డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తే వారి లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు.

### చేతిరాత నైపుణ్యంపై ఉచిత శిక్షణ

మహానంది: విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరూ చేతిరాతను మెరుగు పరుచుకునేందుకు ఏ.కోడూరులో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షుడు కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. హైదరాబాదు నగరానికి చెందిన ప్రముఖ కాలీగ్రఫీ నిపుణురాలు గ్రేస్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. నాలుగవ తరగతి నుంచి ఎంవరకైనా పాల్గొనవచ్చని, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.00గంట వరకు శిబిరం ఉంటుందన్నారు.

- ప్రతి నర్సరీకి లైసెన్స్ తప్పనిసరి
- గతేడాది జీఓ విడుదల చేసిన ప్రభుత్వం
- డివిజన్ పరిధిలో 19 నర్సరీల్లో ఏడింటికే లైసెన్స్
- అనుమతి లేని వాటిలో మొక్కలు కొని నష్టపోతున్న రైతులు

# నర్సరీలు.. నిబంధనలకు నీళ్లు





తంగెడంచ చెక్‌పోస్టు మలుపు వద్ద నిర్వహిస్తున్న కూరగాయల నర్సరీ, నర్సరీలో పెంచుతున్న పలురకాల మొక్కలు

జూపాడుబంగ్లా: రైతుల సంక్షేమం, అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఇందులో భాగంగా ఉద్యాన రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో నర్సరీలకు లైసెన్సు తప్పనిసరి అని గతేడాది జీఓ విడుదల చేసింది. అయితే కొందరు ఎలాంటి లైసెన్సు లేకుండా నర్సరీలు నిర్వహిస్తున్నా ఉద్యాన శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపోయిన రైతులు ప్రభుత్వ సాయం పొందలేకపోతున్నారు.

**కొన్నింటికే అనుమతులు..**

నందికొట్కూరు నియోజకవర్గం పరిధిలో 19 నర్సరీలు ఉండగా అందులో జూపాడుబంగ్లాలో 4, మండ్లెంలో 5, నందికొట్కూరు మండలంలో 10 చొప్పున ఉన్నాయి. వాటిల్లో ఇప్పటిదాకా కేవలం ఏడుగురు నర్సరీల యజమానులు మాత్రమే లైసెన్స్‌లు పొందగా మిగిలిన వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనల ప్రకారం లైసెన్స్ పొందిన నర్సరీల్లో మొక్కలు కొనుగోలు చేసిన, సంరక్షించుకున్న రైతులకు నిర్వాహకులు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలి. అలాగే నర్సరీల నిర్వహణకు సంబంధించి రికార్డులను ఎప్పటికప్పుడు పకడ్బందీగా నిర్వహించాలి. మరో పక్షం రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండగా బోర్లు, బావులున్న రైతులు పచ్చి మిరప, పండు మిరప, టమాట, ఉల్లి, బంతి సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

**మొక్క సంరక్షణకు 40 పైసలు**

రైతులు ఇచ్చిన విత్తనాలను ట్రేలలో విత్తి 40 రోజులపాటు మొక్కలను సంరక్షించి ఇస్తే మొక్కకు 40పైసల చొప్పున రైతుల వద్ద నుంచి నర్సరీల నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. విత్తనాలు నర్సరీ యజమానివే అయితే మొక్కకు 60పైసల నుంచి రూ.1 వరకు తీసుకుంటున్నారు. ఇలా ఎన్ని మొక్కలు అవసరమైతే అంత మేర డబ్బు చెల్లించి మొక్కలను రైతులు తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు సంబంధించి నర్సరీల నిర్వాహకులు రైతులకు ఎలాంటి బిల్లు రశీదులు ఇవ్వడం లేదు. దీంతో రైతులు ప్రకృతివైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయాన్ని అందుకోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి.

**లైసెన్స్‌లేకుండా నర్సరీలు నిర్వహిస్తే చర్యలు**



నర్సరీల నిర్వాహకులు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని ప్రభుత్వం జీవోను విడుదల చేసింది. ఈ మేరకు నర్సరీల నిర్వాహకులందరికీ లైసెన్స్‌లు తీసుకోవాలని సూచించాం. నందికొట్కూరు నియోజకవర్గంలో 19 నర్సరీలు ఉండగా అందులో ఇప్పటిదాకా కేవలం ఏడుగురు మాత్రమే లైసెన్స్ తీసుకున్నారు. మిగిలిన వారు తీసుకోలేదు. కొంత సమయం ఇచ్చి లైసెన్స్ తీసుకోని నర్సరీల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.

– తేజశ్విని, డివిజనల్ హార్టికల్చర్ అధికారిణి, నందికొట్కూరు

**33 శాతం పంట నష్టం వాటిల్లితే నష్టపరిహారం చెల్లింపు**

హార్టికల్చర్ పంటలు సాగుచేసిన రైతులు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు 33శాతం పంట నష్టం వాటిల్లితే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుంది. సీడ్ జనరేషన్ లోపించి దిగుబడి తగ్గినట్లయితే శాస్త్రవేత్తల సహాయంతో విత్తన జర్మినేషన్‌ను పరిశీలించి సంబంధిత విత్తన కంపెనీతో రైతులకు నష్టపరిహారం వచ్చేలా చేస్తారు. అందుకుగాను రైతులు విత్తనాలు, మొక్కలు కొనుగోలు చేసిన బిల్లులు, విత్తన ప్యాకెట్లను భద్రపర్చుకోవాల్సి ఉంటుంది.

### ఫీజు చెల్లించకున్నా సప్లిమెంటరీ రాయొచ్చు

శ్రీశైలంప్రాజెక్ట్: పదో తరగతి ఫెయిల్ అయి సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించని విద్యార్థులు కూడా పరీక్షలు రాయవచ్చని హైస్కూల్ హెడ్‌మాస్టర్ ఈశ్వరమ్మ బాయి బుధవారం తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నందున జిల్లా విద్యాధికారి సుధాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థులందరినీ పరీక్షలకు అనుమతిస్తామన్నారు. పరీక్షలు ఈనె 24 నుంచి 31వ తేదీ వరకు జరుగుతాయని, విద్యార్థులు తమ హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షలకు హాజరు కావాలన్నారు.

**ఈనెల 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు**

జూపాడుబంగ్లా: పదో తరగతి ఫెయిల్ అయిన రాయనున్న విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించినా, చెల్లించకపోయినా ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్న సప్లిమెంటరీ పరీక్షలు రాయవచ్చని ఎంఈఓ చిన్నమద్దిలేటి తెలిపారు. విద్యార్థులందరూ హాల్ టికెట్లను వారు చదివిన పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయుల వద్ద పొందాలని సూచించారు. 2024–25 ఏడాదిలో పదోతరగతి సిలబస్ మారనున్న నేపథ్యంలో విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ విషయాన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పదో తరగతి ఫెయిల్ అయిన, పరీక్ష రాయని విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలియజేసి సప్లిమెంటరీ పరీక్షకు హాజరయ్యేలా చూడాలని సూచించారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు





కోళ్లబావాపురంలో ఇళ్లల్లో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు,పోలీసులు కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాలలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ నాగార్జున హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని కోళ్లబావాపురం గ్రామంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రూరల్ సీఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించి సరైన ధ్రువపత్రాలు లేని 6 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని 40 లీటర్ల సారాను సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముచ్చుమర్రి ఎస్.ఐ జయశేఖర్, పోలీసులు పాల్గొన్నారు.

మిడుతూరు: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించమని, చర్యలు తప్పవని నందికొట్కూరు రూరల్, పట్టణ సీఐలు విజయభాస్కర్, ప్రకాష్ కుమార్ హెచ్చరించారు. బుధవారం మండలపరిధిలోని ఉప్పలదడియ, కలమందలపాడు, మాసపేట గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్షణికావేశంలో చిన్నపాటి గొడవలకు వెళ్లి అనవసరంగా కేసుల్లో చిక్కుకోవద్దని సూచించారు. కుటుంబంలో పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి వారి ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐలు జగన్ మోహన్ , లక్ష్మీనారాయణ, జయశేఖర్, నాగార్జున, సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐలు

**గ్రామాల్లో పోలీసు నిఘా**

మహానంది: రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వారిపై నిఘా ఉంచామని నంద్యాల రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండలం శింగవరం గ్రామంలో బుధవారం గ్రామంలో పోలీసు కవాతు నిర్వహించిన అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. సీఐ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా మొత్తం 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. గ్రామాల్లో వివాదాలకు దూరంగా ఉండాలని, ఎన్నికల్లో గెలిచిన వారు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు నాగేంద్రప్రసాద్, నాగేంద్రప్రసాద్, సీసీ నాగార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం



శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ పురోహితులు



తిలకిస్తున్న భక్తులు

ఆత్మకూరు/ఆత్మకూరురూరల్: మండలంలోని నల్లకాల్వ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో బుధవారం స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకులు ఎస్వీ రమణ ఆధ్వర్యంలో ముందుగా కలశాభిషేకం, కుంకుమార్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి ముత్యాల తలంబ్రాలు, వేద మంత్రాలు, బాజాభజంత్రీల మధ్య కల్యాణాన్ని జరిపించారు. 200 మంది దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవ నిర్వహించారు. స్వామివారి జయంతి వేడుకల్లో భాగంగా లోక కల్యాణార్థం స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, కళ్యాణం నిర్వహించినట్లు పురోహితులు శ్రీనివాసుల ఆచారి తెలిపారు.

**కమనీయం.. పార్వతీపరమేశ్వరుల కల్యాణం**

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో వెలసిన శివాలయంలో తిరునాల సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కమనీయంగా జరిగింది. మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటల శుభముహూర్తాన స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని ఆలయ పురోహితులు లాల్‌బహదూర్ శాస్త్రీ, గ్రామ పురోహితుడు రామయ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణ కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామస్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

**వైభవంగా ప్రభోత్సవం**

ఈశ్వరస్వామి తిరునాల సందర్భంగా ప్రభోత్సవ కార్యక్రమం బుధవారం రాత్రి ఆలయ పురోహితులు లాల్‌బహదూర్ శాస్త్రీ ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా నిర్వహించారు. ముందుగా పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రభవాహనంపై వేయించిపజేసి గ్రామ పురవీధుల వెంట ఊరేగించారు. ప్రభోత్సవం జరుగుతుండగా గ్రామస్తులు, భక్తులు కాయాకర్పూరం సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



గువ్వలకుంట్లలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

## ఆదర్శ ఆర్టీసీ ఉద్యోగులకు అభినందన

ఆత్మకూరు: స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజ్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభను డిపో మేనేజర్ మహేంద్రుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు డిపో ఏప్రిల్ నెలలో 88 ఓఆర్ సాధించి రాష్ట్రంలో మూడో స్థానం, జోన్‌లో ప్రథమ స్థానం సాధించిందన్నారు. అలాగే 5.31 కేఎంపీఎల్ సాధించి జిల్లాలో రెండోస్థానం సాధించినందుకు కండక్టర్, డ్రైవర్లను అభినందించారు. ఏప్రిల్ నెలలో అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు ఎస్.ముర్తుజాబీ, కె.గోవిందయ్య, జీఆర్ఎల్ రెడ్డి, ఎన్.వి.నాయక్, ఎస్.వాసులు, బి.రూపవాణిలను, అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు సి.శివారెడ్డి, పీఆర్‌సీ రెడ్డి, ఎస్.కె.వలి, పి.దర్గయ్య, పి.రహంతుల్లా, ఎం.ఎస్.నాయక్‌లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉద్యోగులను ఆదర్శంగా తీసుకొని డిపోని లాభాలబాటలో నడిపించాలని డిపో మేనేజర్ కోరారు.



ఉద్యోగులకు ప్రోత్సాహక చెక్కును అందజేస్తున్న డిపో మేనేజర్, అధికారులు

## విభిన్న ప్రతిభావంతులను బడిలో చేర్పించాలి

జూపాడుబంగ్లా: విభిన్న ప్రతిభావంతులైన పిల్లలను తల్లిదండ్రులు ఆయా గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ చిన్నమద్దిలేటి సూచించారు. బుధవారం అయన మాట్లాడుతూ జూపాడుబంగ్లాలో విభిన్న ప్రతిభావంతులకు అక్షరభ్యాసం చేయించేందుకు భవిత పాఠశాల ఉన్నట్లు తెలిపారు. 0–5వ తరగతి పూర్తి చేసుకున్న బుద్ధిమాంద్యం, వినికిడిలోపం, శారీరక, అంగవైకల్యం, అంధ విద్యార్థులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులతో మాట్లాడి వారిని పాఠశాలల్లో చేర్పించనున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా ప్రత్యేక ఉపాధ్యాయులు(ఐఈఆర్టీలు) మండలంలోని పారుమంచాల, తరిగోపుల, తూడిచెర్ల, కనకయ్యకొట్టాల, కొత్తసిద్దేశ్వరం, తాటిపాడు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఇప్పటిదాకా 10మంది విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలల్లో చేర్పించారని చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు నాగేంద్రుడు, ఓబన్న తదితరులు పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతుడైన విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రత్యేక ఉపాధ్యాయుడు నాగేంద్రుడు

## సురక్షిత నీటిని అందించాలి

మహానంది: గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా మినరల్ వాటర్ ప్లాంట్లను, నీటిని పరీక్షించాలని ఈఓఆర్డీ శ్రీనివాసులు ఆదేశించారు. బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరు గ్రామంలో బుధవారం పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈఓఆర్డీ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పైపులైన్ల లీకేజీలు ఉంటే వెంటనే అరికట్టేందుకు చర్యలు తీసుకుని ప్రజలకు సురక్షిత నీటిని సరఫరా చేయాలన్నారు. వర్మీ కంపోస్టు తయారు చేసేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని సిబ్బందికి సూచించారు.

## సత్యనారాయణకు నివాళి

ఆత్మకూరు: పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు రాజిక్ అధ్యక్షతన పర్స సత్యనారాయణ 9వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ మాట్లాడుతూ సీఐటీయూ నాయకుడిగా కార్మికోద్యమంలో ఆయన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ ఉపాధ్యక్షులు రణధీర్, నాయకులు ఇస్మాయిల్, అక్కిరాజు, గణపతి, రాజేష్, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం

మహానంది: మసీదుపురం గ్రామానికి చెందిన ఎన్.మల్లేశ్వరి బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన మల్లేశ్వరి, కుటుంబ సభ్యుల మధ్య ఆస్తి పంపకం విషయంలో వివాదం తలెత్తడంతో మనస్తాపానికి గురై గడ్డిమందు సేవించిందన్నారు. ప్రస్తుతం ఆమె నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతుందని చెప్పారు.

## ఘనంగా మహానందీశ్వరుడి కల్యాణోత్సవం



కల్యాణాన్ని జరిపిస్తున్న వేదపండితులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు బుధవారం కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, అర్చకులు స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, మాంగళ్య ధారణ, అక్షతల సమర్పణ పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు.

### మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది: మహానందీశ్వర స్వామి సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి బోర్డు సెక్రటరీ, ఐఏఎస్ శ్రీధర్, కుటుంబ సభ్యులు బుధవారం పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజల అనంతరం స్థానిక అలంకార మండపంలో స్వామి అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.



ఏపీసీబీ సెక్రటరీ శ్రీధర్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి

## పట్టణ ప్రజల దాహం తీర్చాకే నీళ్లు తీసుకెళ్లండి

నందికొట్కూరు: పట్టణ ప్రజల దాహం తీర్చిన తరువాతనే ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి ఓర్వకల్లుకు తీసుకెళ్లాలని సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డికి ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం పైపులైన్ ద్వారా పట్టణ ప్రజలకు దాహం తీర్చాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి ఓర్వకల్లు పరిశ్రమలకు కృష్ణా జలాలను తరలించినప్పుడు నందికొట్కూరు పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు నీరు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీరాములు, ఉపేంద్ర, భాస్కర్‌గౌడ్, రామకృష్ణ, చాంద్‌బాషా, మహేష్, మల్లేశ్వరమ్మ పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ మురళీ కల్యాణి

మహానంది: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, నిర్ణీత వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని నంద్యాల డీఎల్‌డీఓ మురళీ కళ్యాణి సూచించారు. బండిఆత్మకూరు మండల కేంద్రంలోని సచివాలయం-1లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ ఏసుపాదం, సిబ్బంది మహబూబ్‌బాషా, మేఘశ్యామ్ ఆచారి, జక్రియా, అయేషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు: మండలకేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలల అక్రమ అడ్మిషన్లు అడ్డుకోవాలని, టీచర్లతో అడ్మిషన్ల కోసం ప్రచారం చేయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆత్మకూరు ఎంఈఓ-2 సురేష్‌కి వినతి పత్రం అందజేశారు. ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి ఎస్ నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ టీచర్లతో అడ్మిషన్ల కోసం క్యాంపెనింగ్ చేయించకూడదని నిబంధనలు ఉన్నా.. యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఉపాధ్యాయులను మండుటెండల్లో వీధివీధి తిప్పుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అలాగే విద్యార్థుల ర్యాంకుల ప్రచారం చేసుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఏ నియోజకవర్గ అధ్యక్షుడు వర్ధన్, టౌన్ నాయకులు రాజు పాల్గొన్నారు.

## రోడ్డుపై పడిన వృక్షాల తొలగింపు

మహానంది: బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరు, పార్నపల్లె గ్రామాల మధ్యన రోడ్డుకు అడ్డుగా పడిన వృక్షాలను బుధవారం పంచాయతీ కార్యదర్శులు తొలగించారు. రెండు గ్రామాల కార్యదర్శులు వెంకటరాముడు, సుబ్బారావులు డోజర్ సహాయంతో రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయడంతో ప్రయాణీకులు, స్థానికులు అభినందించారు.